# 13

# “పరిశుద్ధుల సంఘములు”

*“ఆలాగే పరిశుద్ధుల సంఘము లన్నిటిలో దేవుడు సమాధానమునకే కర్త గాని అల్లరికి కర్తకాడు” (1 కొరింథీ. 14:33).*

కొన్ని సార్లు ఒక వస్తువుకుగాని లేక కార్యానికిగాని తప్పు పేరు పెడతాము, అయితే ఏదో ఒక కారణాన్నిబట్టి దానిని మనమెన్నడును దిద్దుకోము. మాటి మాటికి ఉపయోగించడం ద్వారా, ఆ తప్పు అలవాటుగా, పదంగా మారిపోతుంది. మరియు మనం అందులో బిగింపబడతాం; తప్పు అర్థాన్ని ఒక వాస్తవానికి లేక భావనకు వినియోగిస్తాం.

ఉదాహరణకు, రోడ్డు ప్రమాదంలో ఒకడు కారుతో చిక్కుకున్నాడు. అతడు గాయపడలేదు, అయితే అతని కారు భయంకరంగా దెబ్బతింది, ఆ చోటునుండి నడిపించడానికి కూడా వీలులేనట్టయింది. ఆ దుస్థితినుండి ప్రమాదంలో చిక్కుకున్నవానికి సహాయపడడానికి త్రోవను వెళ్లుతున్న ఒకడు, “రెక్కర్‌ను పిలువమంటావా?” అని అడిగాడు. అందుకు విచారంలో మునిగిన అతడు, “నాకు రెక్కర్ అవసరం లేదు. పాడయిపోవడం అనేది జరిగేపోయింది. పగిలిపోయిన నా కారును నెట్టుకొనిపాయే లారీ నాకు కావాలి!” అని అన్నాడట. పగిలిపోయినవాటిని తొలిగించడానికి ఉపయోగించే లారీని “రెక్కర్” అని మాత్రం పిలుస్తాం; అయితే అదే లారీ రోడ్డుమీద మనవైపు వస్తుంటే దానికి తప్పు పేరు పెడతాం.

భాషా వృద్ధియందు, తరచుగా ఓ మంచి మాట నిజంగా దానికి చెందని భావంతో జోడింపబడుతుంది. భాష తెలిసినంత మాత్రాన భావ వినిమయాలు సజావుగా జరిగిపోతాయనే గ్యారంటీ లేదని ఈ అసాధారణమైన సంభవం మనకు గుర్తు చేస్తుంది. ఆలోచనలు నిజంగా పంచుకోవాలనుకుంటే తగిన ప్రయాస అవసరం. తారుమారు జరిగే అవకాశం ఉన్నందువల్ల – వస్తువులకు తప్పుడు పేర్లు, మాటలను తప్పుగా ఉపయోగించడమనే “భాషా ప్రమాదాలు,” లేక “పలుకుల్లో లోపాలు” జరుగకుండ భద్రపడాలి. అంతేగాక, భాషకు సంబంధించిన ముఖ్యమైన అంశాన్ని గాని లేక చర్చనీయాంశాన్నిగాని అపార్థానికి నడిపించక ఉండేలా జాగ్రత్త వహించాలి.

తారుమారు అయ్యే మాటలను గూర్చిన ఆ ఆలోచనలను మనస్సులో ఉంచుకొని, "పరిశుద్ధుడు" అనే పదంవైపు దృష్టి నిలుపుదాం. క్రీస్తు సంఘములను గూర్చి 1 కొరింథీ. 14:33లో పౌలు సాధారణంగా ఉపయోగించిన దానిలో బహువచన రూపం కన్పిస్తుంది: "ఆలాగే పరిశుద్ధుల సంఘములన్నిటిలో దేవుడు సమాధానమునకే కర్తగాని అల్లరికి కర్త కాడు." "పరిశుద్ధుల సంఘములన్నిటిలో" అనే పేరు శ్రద్ధ కలిగించేదిగాను, సమాచార మిచ్చునదిగాను, విశదీకరించునదిగాను ఉండి, సంఘముగా రూపొందు ప్రజలకు రేఖా పూర్ణ దృష్టిని యిస్తుంది. ఈ వచనం ప్రకారం, "పరిశుద్ధుడు" అనే పదాన్ని బైబిలు భావనలోనే పెట్టి ఆలోచింపకపోయినట్లయితే, సంఘమును గూర్చిన సంపూర్ణమైన గ్రహింపును ఒకడు పొందలేడు.

## పదము గుర్తించబడింది

దైవభక్తికి పేరుగాంచిన వ్యక్తిని సూచించడానికి "పరిశుద్ధుడు" అనే పదం అపార్థ యుక్తంగానే వినియోగింపబడింది! "ఆ మనిషి నిజంగా పరిశుద్ధుడు!" అని ఒకడంటాడు. పరిశుద్ధుడు అని పిలువడానికి ఆ వ్యక్తి నిజంగా హక్కును సంపాదించుకున్నట్టు సూచింప బడ్డాడు.

శ్రేష్ఠమైన విశ్వాసపు సేవ చేసి చనిపోయినవారికి ప్రత్యేకించి ఆ పదం ఉపయోగింప బడుతూ ఉంది. ఈలాగు ఆ పదాన్ని ఉపయోగించేవారు ఆ వ్యక్తి చనిపోయేవరకు దానిని అతనికి వర్తింపజేయరు. అతడు మరణించిన తరువాత అధికార పూర్వకంగా పరిశుద్ధుడని అతని గుర్తిస్తారు. ఈ రెండు నిర్వచనాల ప్రకారం "పరిశుద్ధుడు" అని ఉపయోగించే పదం లేక ప్రయోగం బైబిలు సంబంధమైనదో, దైవ ప్రేరేపితంగా చేయబడిందో కాదు.

"క్రీస్తులో ఉన్నవారిని సూచించడానికి" క్రొత్త నిబంధన లేఖకులు దృఢంగా ఈ పదాన్ని ఉపయోగించారు. పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రికలో దీనికి ఉదాహరణను చూడవచ్చు. ఆ పత్రిక యొక్క ఆరంభంలో, అతడిలా వ్రాశాడు: "ఫిలిప్పీలో ఉన్న క్రీస్తు యేసునందలి సకల పరిశుద్ధులకును అధ్యక్షులకును పరిచారకులకును క్రీస్తుయేసు దాసులైన పౌలును తిమోతియును శుభమని చెప్పి వ్రాయునది" (ఫిలిప్పీ. 1:1). ఉత్తరాన్ని ముగించుతూ అతడిట్లన్నాడు: "ప్రతి పరిశుద్ధునికిని క్రీస్తుయేసునందు వందనములు చెప్పుడి. నాతోకూడ ఉన్న సహోదరులందరు మీకు వందనములు చెప్పుచున్నారు. పరిశుద్ధులందరు ... మీకు వందనములు చెప్పుచున్నారు" (ఫిలిప్పీ. 4:21, 22). తాను వ్రాస్తున్న ప్రాంతమందున్న ప్రతి క్రైస్తవుని పౌలు పరిశుద్ధుడుగా గుర్తించాడు. తాను ఏ పట్టణానికి వ్రాస్తున్నాడో అక్కడ ఉన్న ప్రతి క్రైస్తవుని అతడు పరిశుద్ధునిగానే చూచాడు.

"పరిశుద్ధుడు" అనే మాటలో "పవిత్రమైన ఉపయోగానికి వేరుగా ఉంచబడినవాడు" లేక దేవుని కొరకు వేరుచేయబడినవాడు అనే భావన స్వాభావికంగానే ఉంది. క్రైస్తవుడు స్థితిలోను, సూత్రంలోను, తాను మార్పు చెందినప్పుడే పరిశుద్ధుడౌతాడు. సువార్త ద్వారా దైవికమైన సేవకు అతడు వేరుచేయబడతాడు. మార్పు చెందక మునుపు, అతడు

అపవాదికి, లోకానికి చెందినవాడై స్వార్థపరమైన ఆశలచే అధికారం చెలాయించబడినవాడై ఉంటాడు; అయితే మార్పు చెందినప్పుడు, దేవుని సొత్తుగాను లేక వ్యక్తిగాను అతడు రూపొందుతాడు (1 పేతురు 2:9).

ఈ విధంగా, క్రైస్తవులందరు పరిశుద్ధులుగా క్రొత్త నిబంధనలో చిత్రింపబడ్డారు. సౌలు వద్దకు వెళ్లి అతడు ఏమి చేయాలో తెలుపవలసిందిగా మన ప్రభువు అననీయను సౌలు వద్దకు పంపుతాడు. అననీయ ఆ ఆజ్ఞకు ప్రత్యుత్తరమిస్తూ, యెరూషలేములో ఉన్న క్రైస్తవులందరిని సూచించడానికి ఈ పదాన్ని ఉపయోగించాడు: "... ప్రభువా, యీ మనుష్యుడు యెరూషలేములో నీ **పరిశుద్ధులకు** ఎంతో కీడు చేసియున్నాడని అతనిగూర్చి అనేకులవలన వింటిని" అని అననీయ అన్నాడు (అపొ. 9:13; ఒత్తి పలికింది నాది). పేతురు యొక్క సువార్త ప్రయాణాలను గూర్చి రిపోర్టు యిస్తూ, లుద్దలో ఉన్న క్రీస్తు శిష్యులను "పరిశుద్ధులని" అతడు పిలిచాడు: "పేతురు సకల ప్రదేశములలో సంచారము చేయుచు, లుద్దలో కాపురమున్న **పరిశుద్ధుల**యొద్దకు వచ్చెను" (అపొ. 9:32; ఒత్తి పలకడం నాది). క్రైస్తవుల జీవితంలో పరిశుద్ధాత్మ యొక్క పనిని గూర్చి పౌలు రోమీయులకు వ్రాస్తున్నాడు. ఆ సందర్భంలో, దేవుని పిల్లలను అతడు పరిశుద్ధులని వర్ణించాడు: "మరియు హృదయములను పరిశోధించువాడు **ఆత్మ**యొక్క మనస్సు ఏదో యెరుగును; ఏలయనగా ఆయన దేవుని చిత్తప్రకారము **పరిశుద్ధుల** కొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు" (రోమా 8:27; ఒత్తి పలకడం నాది). పరిశుద్ధాత్మ పరిశుద్ధులందరి కొరకు విజ్ఞాపనము చేస్తున్నాడు, అంటే దేవుని పిల్లలందరి కొరకు చేస్తున్నాడని అతడు చెప్పాడు. "క్రైస్తవుడు" లేక ఏ వర్ణన చేతనైన "క్రీస్తులో ఉన్నవానిని" పరిశుద్ధుడని క్రొత్త నిబంధన స్థిరపరుస్తున్నట్టు స్పష్టమౌతుంది.

"సెయింట్" అనే పదాన్ని "పరిశుద్ధుడు" అని తర్జుమా చేయవచ్చు, "పరిశుద్ధపరచు," "పరిశుద్ధపరచబడు," "పరిశుద్ధపరచబడుట" అన్న పదాల ధాతువులోంచి "పరిశుద్ధుడుగా చేయబడు" అనే అర్థంతో వస్తుంది. పౌలు ఈ విధంగా వ్రాసాడు: "ప్రభువువలన ప్రేమింపబడిన సహోదరులారా, **ఆత్మ** మిమ్మును పరిశుద్ధపరచుటవలనను, మీరు సత్యమును నమ్ముటవలనను, రక్షణపొందుటకు దేవుడు ఆదినుండి మిమ్మును ఏర్పరచుకొనెను గనుక మేము మిమ్మునుబట్టి యెల్లప్పుడును దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లింప బద్ధులమైయున్నాము. మీరీలాగున రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమను పొందవలెనని, ఆయన మా సువార్తవలన మిమ్మును పిలిచెను" (2 థెస్స. 2:13, 14). అతడు లేక ఆమె సువార్తకు లోబడి క్రీస్తులోనికి వచ్చినప్పుడు, విశ్వాసి సత్యముద్వారా ఆత్మవలన పరిశుద్ధపరచబడినవాడౌతాడు (యోహాను 17:17; 1 పేతురు 1:1, 2). (లేక ఔతుంది.)

"పరిశుద్ధుల సంఘములు" అనే పద ప్రయోగం యొక్క 1 కొరింథీ. 14:33లోని సందర్భం "పరిశుద్ధులు" అనే పదాన్ని పరిశుద్ధాత్మ ఎలా ఉపయోగించాడో వివరిస్తుంది. ఆరాధన కొరకైన సంఘ కూడికలో, పరిశుద్ధాత్మ వరాలను ఎలా ఉపయోగించుకోవాలో కొరింథీ సంఘానికి వివరించుతున్న చివరి భాగంలో ఈ పద ప్రయోగం చేయబడింది. మన బైబిల్లో అధ్యాయాల ప్రకారం విభజింపబడిన దానిననుసరించి, అద్భుత వరముల

యొక్క చర్చ 12వ అధ్యాయంలో ఆరంభమై 14వ అధ్యాయం చివరిలో ముగుస్తుంది. 1 కొరింథీలో సుదీర్ఘంగా విషయాన్ని వివరించినవాటిలో యిది ఒకటి. మొదటి శతాబ్దంలోని సంఘం క్రమముగాను మర్యాదగాను ఆరాధనా కార్యక్రమాలను జరిగించుకొనడానికి గాను ఈ హెచ్చరికలు ప్రత్యేకంగా యివ్వబడ్డాయి.[1] వారి కూడికలు క్రమబద్ధంగా లేక తారుమారుగా[2] జరుగుతున్నందున, "ఈలాటి సమస్యను పరిష్కరింప గోరి, తగిన ఆత్మసంబంధమైన ప్రవర్తన కలిగియుండాలని" పౌలు హెచ్చరించాడు. అతని విన్నపము విశాలమైనది, విస్తృతమైనదైయుంది. తన సంఘములన్నిటిలో దేవుని ప్రభావము సమాధానముగాను ఉండాలని పౌలు అంటున్నట్టున్నాడు. తన హెచ్చరిక సంఘములన్నిటికి, "పరిశుద్ధుల సంఘాలుగా" లేక "ప్రత్యేకింపబడిన దేవుని ప్రజలుగా" ఉన్నవారి నందరిని సూచిస్తుంది.

1, 2 కొరింథీ పత్రికలలో వందన వచనాల్లో "పరిశుద్ధులు," "సంఘము" అనే దానితో పర్యాయంగా చేయబడింది (1 కొరింథీ. 1:2; 2 కొరింథీ. 1:1). ఫిలేమోను (5 వ.), ఎఫెసీ. (1:1), ఫిలిప్పీ. (1:1), కొలస్సీ. (1:2)లను కూడా చూడు. కొరింథులో ఉన్న క్రైస్తవులు అనేక సమస్యలతోను తప్పు త్రోవలతోను బాధింపబడుతున్నట్టు పౌలు వారికి వ్రాసిన ఈ పత్రికలలో సూచింపబడింది. అయినప్పటికిని, పౌలు వారిని పరిశుద్ధులనే సంబోధించాడు. అతని ప్రారంభపు మాటలు క్రీస్తునందు వారికున్న స్థితిని ప్రతిఫలింపజేశాయి. "కొరింథులోనున్న దేవుని సంఘమునకు, అనగా క్రీస్తుయేసునందు పరిశుద్ధపరచబడినవారై పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడినవారికిని, వారికిని మనకును ప్రభువుగా ఉన్న మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున ప్రతిస్థలములో ప్రార్థించువారి కందరికిని శుభమని చెప్పి వ్రాయునది" (1 కొరింథీ. 1:2). అందునుబట్టి, క్రీస్తులో ఉన్న ఎవడైనా పరిశుద్ధుడే, నిజమైన క్రీస్తు సంఘమేదైనా పరిశుద్ధుల సముదాయమే.

## పదము ఉదహరింపబడింది

అలా పిలువబడినవారు "సజీవ" సమర్పణగల ప్రజలైయుండాలని ఆదేశిస్తుంది. "పరిశుద్ధుడు" అన్న పదంలో ఇమిడిన అర్థం ఈ పదం ఎలా మనలను బాధ్యులుగా చేస్తుందో పాత నిబంధన చరిత్రలోని రెండు చిత్రాలు చూపుతాయి.

### దేవుడు, ఇశ్రాయేలు జనాంగం

ఇశ్రాయేలు జనాంగంతో దేవునికిగల బాంధవ్యంలో ప్రత్యేకంగా కన్పించే పాత నిబంధన భావన ఈ పదం వెనుక ఉన్నది. దేవుడు ఒక జనాంగాన్ని తన సొంత ప్రజలుగా ఏర్పరచుకొని, వారిద్వారా తన విమోచనా ఉద్దేశాలను నెరవేర్చుకోవాలనేది పాత నిబంధన యొక్క ప్రధానాంశమై ఉంది. ఆయన అబ్రాహామును ఏర్పరచుకొని, అతనిని అనేకులకు తండ్రినిగా చేతునని వాగ్దానం చేశాడు (ఆది. 15:5). ఆయన వాగ్దానం యొక్క నెరవేర్పు ఇస్సాకు యాకోబులది. యాకోబు యొక్క కుటుంబికుల

ద్వారా విచ్చుకుంది. 75 మంది సభ్యులతో[3] పెద్ద పరిమాణంగల కుటుంబంగా ఏర్పడి ఐగుప్తుకు వలసపోయారు. కాలక్రమంలో నియంతయైన ఫరోకు వారు దాసులయ్యారు. నిర్గమకాండం తొలి అధ్యాయాలలో కన్పించినట్టు కొన్ని వందల సంవత్సరాల తరువాత ఆ బానిసత్వం తొలిగిపోయింది - అసలుకి డెబ్బై అయిదుగురుగా ప్రారంభమైన ఇశ్రాయేలీయులు, 25 లక్షలు లేక అంతకంటె ఎక్కువగా అంచనా వేయబడిన జనాంగంగా విస్తరించారు. అబ్రాహాము సంతానము సంఖ్యలో బహుగా విస్తరించునట్టు దేవుడు ఆశీర్వదించాడు. వారు బానిసలుగా ఉన్న సంవత్సరాలలో గొప్ప జనాంగంగా త్వరితగతిని విస్తరించిన తీరు ఆశ్చర్యకరమైనట్టు పండితులచే గుర్తింపబడింది. మోషే ద్వారా దేవుడు వారిని బాధ అనే కొలిమిలోనుండి బయటికి నడిపించి, సీనాయి అనే దేవుని పర్వతము వద్దకు రప్పించి, దేవుడు వారితో యిలా అన్నాడు: "మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచినయెడల మీరు సమస్తదేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. సమస్తభూమియు నాదేగదా. మీరు నాకు యాజక రూపమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురు ..." (నిర్గమ. 19:5, 6).

ఇశ్రాయేలు ఎల్లవేళల దేవుని పరిశుద్ధ జనముగా ఉండలేదనేది నిశ్చయం; ఏదియెలాగున్నా, వారు, స్థానంలో లేక స్థాయిలో "ప్రత్యేకింపబడిన" దేవుని ప్రజలై ఉన్నారు. ఆచరణలో ఆయన ప్రజలుగా ఉండ తప్పిపోయినప్పుడు, వారి పాపమును వారి తిరుగుబాటును ఆయన క్షమించలేదు. ఆయన అలా ఎన్నడు చేయడు. తన పిల్లలలోనేగాని మరి యింకెవరిలోనేగాని పాపమును ఆయన ఊరకయే మన్నించడు. తాను జీవించిన దానికొరకు ప్రతి ఒక్కడు దేవునియెదుట జవాబు చెప్పవలసిందే - అతడు దేవుని నిబంధనలో ఉన్నా లేకపోయినా సరే (2 కొరింథీ. 5:10). అయినప్పటికి, లోకపు జనములందరిలోనుండి, ఇశ్రాయేలీయులు దేవుని ప్రజలుగా దైవికంగా పిలువబడ్డారు. ఒక భావంలో వారు పరిశుద్ధులు, పరిశుద్ధ జనం.

## దేవుడు, లేవీయ యాజకత్వం

మోషే యొక్క మిత వ్యయంలో "పరిశుద్ధుడు" అనే ఆలోచన యాజక ధర్మంలో మనము చూడగలము. పాత నిబంధన యాజకత్వపు నిర్వహణ మూడు కాలాల్లో వచ్చింది. మొదటిదాన్ని **విమోచనా దశ** అని పిలువవచ్చు. ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి తరలి వచ్చే రాత్రి, సంహారకుడు వారి తొలి చూలులను "దాటిపోయినప్పుడు" వారు దేవునికి ప్రత్యేకమైన సేవ చేయడానికి ప్రతిష్ఠింపబడ్డారు (నిర్గమ. 13:11-15; సంఖ్యా. 3:13). వారు దేవునికి పరిశుద్ధులైయుంటారు.

రెండవది **ప్రక్షిప్తపు దశ లేక బదులుగానుంచు దశ**. దేవుని సేవించడంలో తొలి చూలులకు మారుగా లేవీ గోత్రికులు ఎన్నుకోబడ్డారు. బంగారు దూడ సంఘటనలో వారు కనుపరచిన భక్తి విశ్వాసాలకు బహుమానంగా వారు ఈ సేవకు అంగీకరింపబడ్డారు (నిర్గమ. 32:25-29). తొలుత, ఐగుప్తునుండి వచ్చిన జ్యేష్ఠులకు మారుగా ఈ గోత్రం నియమింపబడింది; అయితే పుట్టబోవు మొదటి మగ సంతానానికి మాత్రం వారి తల్లిదండ్రులు అయిదేసి తులముల వెండిని మందిర ధనాగారానికి చెల్లించి, తగిన

బలిని సమర్పించి విమోచించుకోవలసి ఉంటుంది.[4]

తరువాత **కోరుకునే లేక తీసికొనే** దశ వచ్చింది. లేవీ గోత్రంనుండి అమ్రాము యింటివారు దేవునికి అసలైన యాజకులుగా పని చేయునట్లు కోరుకోబడ్డారు. అహరోను తొలి ప్రధాన యాజకుడును, అతని కుమారులు యాజకులునైరి. ప్రత్యక్షగుడారము వద్ద దేవునికి పవిత్రమైన పరిచర్య జరిగించడానికి అహరోను కుమారులు ప్రత్యేకింపబడ్డారు. ఆ కుటుంబంనుండి రాకపోతే మాత్రం లేవీయులలో ఎవడును యాజక ధర్మం అధికార పూర్వకంగా జరిగించ వీలులేదు. తక్కిన లేవీయులు ప్రధాన యాజకునికి, యాజకులకును సహాయం చేసేవారుగా పని చేయాలి.

ఇశ్రాయేలు సీనాయి వద్ద విడిది దిగియున్నప్పుడు యాజకత్వం తొలిగా ఏర్పాటు చేయబడింది – అహరోనును అతని కుమారులైన – నాదాబు, అబీహు, ఎలియాజరు, ఈతమారును యెహోవా దేవునిచే యాజకులుగా నియమించబడ్డారు (నిర్గమ. 28:1). రక్తంచేత వారు ఈ పనికి అర్పణం చేయబడ్డారు. వారు దేవుని సేవకు సంపూర్ణంగా సమర్పించబడ్డారనే దానికి గురుతుగా, రక్తము వారి కుడి చెవులకు, బొటన వ్రేళ్లకు, కాలి బొటన వ్రేళ్లకు తాకించబడింది (లేవీ. 8:23, 24). అహరోను సహితము "పరిశుద్ధమైన నూనెతో" అభిషేకింపబడ్డాడు. పరిశుద్ధ యాజకుడుగా ఉండునట్లు అతని పరిశుద్ధమైన అంతస్థును సూచించడానికి అది చేయబడింది (లేవీ. 4:3, 5; 8:12).

**పరిశుద్ధుడంటే తప్పులేనివాడని కాదు,<br>అయితే దేవుని కృపనుబట్టి అతడు<br>నిందారహితుడై క్షమింపబడినవాడుగా<br>పరిపూర్ణుడైయుంటాడు.**

ఈ పద్ధతి చొప్పున, ఏర్పరచుకొనబడిన మనుష్యులు పాత నిబంధన కాలంలో దేవుని పవిత్రమైన పనికొరకు ప్రత్యేకింపబడినవారై ఉన్నారు. వారు యాజకులని పిలువబడినవారై, దేవుని యెదుట సేవ చేయునట్టి అత్యున్నతమైన స్థానము పొంది యున్నారు (నిర్గమ. 29:44). బాంధవ్యపు ప్రత్యేకానుకూలతలో వారున్నారు, అయితే తాము పిలువబడిన పిలుపునకు తగినట్టుగా దేవుని యెదుట వారు నడువవలసినవారై ఉన్నారు. తమకు ఆజ్ఞాపింపని వేరొక అగ్నిని అర్పించడం ద్వారా అవిధేయులు కాగా, వారు దేవుని యెదుట నిలుచునట్లు ప్రతిష్ఠింపబడిన యాజకులైనా, నాదాబు అబీహులు సంహరింపబడ్డారు (లేవీ. 10:1, 2).

ఇశ్రాయేలు జనాంగంవలెను, పాత నిబంధనలో దైవికంగా ఏర్పరచుకున్న యాజకుల వలెను, క్రైస్తవ యుగంలో సంఘం ఏర్పరచబడిన దేవుని జనులైయున్నారు (1 పేతురు 2:9). ప్రభువునకు సంఘము పరిశుద్ధ జనమై, ప్రత్యేకింపబడిన ప్రజలైయున్నారు. సంఘమును గూర్చి పేతురు యిలా అన్నాడు: "యేసు క్రీస్తుద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా

ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్లవలెనుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు” (1 పేతురు 2:5). ఏర్పరచబడిన దేవుని వంశముగా, సంఘము “పరిశుద్ధుల” సంఘమైయుంది.

పరిశుద్ధుని గూర్చిన దేవుని దృక్పథానికి ఇటీవల ఉదాహరణగా జెఫ్రీ డాహ్మర్ పేరు మోసిన ధారాపాత హంతకుడిగా చరిత్రలో మిగిలిపోతాడు. అతడు 17 మంది పురుషుల్ని, బాలురను చంపినట్టు నిరూపించబడి తిరిగి బయటకు వచ్చే అవకాశం లేకుండా యావజ్జీవ కారాగార శిక్షకు గురి అయ్యాడు. కాని మనం ఎరిగినంతమట్టుకు అతడు పరిశుద్ధుడయ్యాడు.

World Bible School ఉపాధ్యాయులిద్దరు, కర్‌టిస్ బూత్ మరియు మేరీ మాట్ అనేవారు T.V. న్యూస్‌లో జెఫ్రీని గూర్చి విని, వార్తా పత్రికల్లో చూచి, కరెస్పాండెన్స్ కోర్స్ పాఠాలు అతనికి పంపారు. జెఫ్రీ ఆ పాఠాలను శ్రద్ధగా చదివి, కడకు బాప్తిస్మం పొందాలనే తన కోర్కెను వారిద్దరికి ఉత్తరం ద్వారా తెలిపాడు. కొద్ది వారాలలోపు, మే 10, 1994న, రాయ్ రాట్ క్లిఫ్ ఒక నీటి గుంటలో ఖైదీలో ఉన్న జెఫ్రీకి బాప్తిస్మమిచ్చాడు. తన బాప్తిస్మం తరువాత, రాయ్‌తో జెఫ్రీ ప్రతివారం చదువుతూ, క్రీస్తునందు ఎదుగుతూ, ఆయనను సేవించడానికి అవకాశాలను వెదకుతూ ఉండేవాడట. నవంబరు 28, 1994లో, ఖైదులోని స్నానపు గదిలో జెఫ్రీ చావగొట్టబడ్డాడట. అతని మరణానికి సంబంధించిన వివరాలు మనకు తెలియవు, కాని జెఫ్రీ నిష్కపటంగా ఉన్నాడని, తన మరణంవరకు క్రీస్తుకు సమర్పించుకున్నవాడై ఉన్నాడని రాయ్ నమ్ముతాడు.

సువార్త అందరికి – అతి చెడ్డవానికి, అతి మంచివానికి, మరియు వీరిద్దరి మధ్య నిలిచిన ప్రతివానికి కూడా. క్రీస్తులోనికి మార్పు చెందినప్పుడు, జెఫ్రీ దాహ్మర్ పరిశుద్ధుడుగా మారి, తన మరణ పర్యంతము పరిశుద్ధుడుగానే ఉన్నాడు. అమెరికా చరిత్రలో అత్యంత క్రూర నేరస్థుడుగా అందరిచేత అతడు గుర్తింపబడినా, దేవుని ఆశ్చర్యమైన కృపనుబట్టి, తన జీవితంలోని చివరి ఆరు మాసాలు అతడు పరిశుద్ధుడుగా జీవించాడు!

దేవుడు మన పాపములలో మనలను రక్షించడు – ఆయన మన పాపములనుండి మనలను రక్షిస్తాడు. తన రక్షణను పొందడానికిగాను విశ్వాసము విధేయతను ఆయన కోరుతున్నాడు. మన తప్పులను ఆయన పవిత్రపరచడు, అయితే వాటినుండి ఆయన మనలను రక్షిస్తాడు. విశ్వాసము, మారుమనస్సు, యేసును దేవుని కుమారునిగా ఒప్పుకొనడం, క్రీస్తులోనికి బాప్తిస్మం పొందడం ద్వారా ఒకడు క్రీస్తు వద్దకు రాగా, ఆయన ఆ వ్యక్తిని శుద్ధీకరించి, తన సేవ కొరకు వానిని ప్రత్యేకపరచుతాడు. పరిశుద్ధుడంటే తప్పులేనివాడని కాదు, అయితే దేవుని కృపనుబట్టి అతడు నిందారహితుడై క్షమింపబడిన వాడుగా పరిపూర్ణుడైయుంటాడు.

## ఆ పదం అమలుపరచబడింది

“పరిశుద్ధుల సంఘములు” అనే ప్రయోగం ప్రశస్తమైన బిరుదైయున్నదని సంఘము తన హృదయంలోనికి దాన్ని తీసికోవాలి. దేవుడు తన ప్రజలను “పరిశుద్ధులు” అని

పిలుస్తున్నాడు! ఈ బిరుదు మన మీద ఎంతటి ప్రభావాన్ని కనుపరచవలసియుంది!

దాన్ని మనం అంగీకరించవలసియుంది. దేవుడు ఈ గుర్తింపును తన సంఘానికి యిచ్చాడు, సంఘంకొరకు తనకున్న ఉద్దేశాన్ని మనకు గుర్తు చేయడానికే. అతనికి చెందిన అద్భుతమైన జనంగా మనం ఉండాలనేది ఆయన చిత్తమైయుంది. మనం తన సొత్తయిన ప్రజలుగా ఉండాలనేదే ఆయన ఉద్దేశం. దేవుని ఆరాధనకు ఆయన పనికి ప్రత్యేకింపబడినవారమైయున్నట్టు మనలను మనమే చూచుకొంటూ ఉండాలి.

దాన్ని మనం అభినందించాలి. దేవుడు ఏర్పరచుకున్న జనంగా ఉండడంలో ఉన్న ఘనతను గూర్చి ఆలోచించు. అంతకుమించి ఉత్సాహాన్ని కలిగించేది ఏముంటుంది? ఇంకా ఏ మాట మనలను ప్రోత్సహించుతూ ఉంటుంది? మనం దేవుని కుటుంబంలోనికి దత్తు తీసికోబడ్డాం (ఎఫెసీ. 1:5). ఆయన తన ప్రేమను మన హృదయములలోనికి పంపి, మనలను తన స్వాస్థ్యంగా చేసికొన్నాడు!

మనం దాన్ని వర్తింపజేసికోవలసి ఉంటుంది. తన అంతస్థుకు తగినట్టుగా క్రైస్తవుడు తన ఆచరణను నిలుపుకోవాలి. తన ప్రవర్తన విశ్వాసంతో సరితూగాలి.

"పరిశుద్ధుడు" అనే పదం నిలిపిన ప్రమాణానికి తగినట్టు జీవించడంలో తరచుగా మనం తప్పిపోతాం. మనం మన యాజమానునికి శిష్యులం, మన ఉపాధ్యాయునికి విద్యార్థులం (అపొ. 11:26), అయితే శిష్యులుగానే ఎల్లప్పుడు మనం పని చేయం. తరగతులు ప్రారంభమైనప్పుడు మనం కొన్ని సార్లు ఆసల్యంగా వస్తాం. ఆయన ఉపదేశించేటప్పుడు, వినుటకు మనం మందమతులమై ఉంటాం; క్రమశిక్షణ లేకయుంటాం (హెబ్రీ. 5:11). మన సమర్పణకు తగినట్టు మన ప్రవర్తనను కూడా ఒకే వరుసలోనికి తేవాలి, మన జీవితాలను మన ప్రేమకు సమంగా నడిపించాలి.[5]

ప్రతి క్రైస్తవుడును పరిశుద్ధుడే, గనుక తాను పిలువబడిన పిలుపునకు తగినట్టుగా జీవించడానికి కృషి చేయాలి (ఎఫెసీ. 4:1). "మొదట నీవు నమ్మవలసియుంది. తరువాత నీవు ప్రవర్తించవలసి ఉంది."

దేవుడు మనలను తన "నిజమైన" ప్రజలుగా – ఆయన మనకిచ్చిన వర్ణన ననుసరించి "పరిశుద్ధులుగా" ఉండాలని పోటీపడమంటున్నాడా! – మన కొరకైన తన పరిశుద్ధ ఉద్దేశము మనయందు ప్రేరేపించునట్లు, మనలో ప్రతి ఒక్కరి పేరును దేవుడు "పాపినుండి" పరిశుద్ధునిగా మార్చాడు.

## ముగింపు

దేవుడు తన సంఘాన్ని ఎలా చూస్తాడు? పౌలు ప్రకారం, వర్తమాన కాలంలో ఆయన మనలను పరిశుద్ధులనుగా చూస్తున్నాడు. "భవిష్యత్తులో ఒకనాడు నా పిల్లలలో ఒకరో యిద్దరో పరిశుద్ధులనబడడానికి చేరుకుంటారు" అని ఆయన అనలేదు. లేదు "నా సంఘమైన మీరందరు నా పరిశుద్ధులు!" అని ఆయన అంటున్నాడు.

చెప్పబడిన ఒక కథ ప్రకారం, మైకిలేంజిలో యొక్క అధ్వర్యంలో అతని వర్క్ షాపులోనికి ఒక రోజున పాలరాయి ఒకటి తరలింపబడిందట. చాలా బరువైన ఆ

రాయిని పనివారు అలక్ష్యంగాను మొరటుగాను దొర్లిస్తుంటే, మైకిలేంజిలో యిలా అరిశాడట, "ఆ రాతితో జాగ్రత్తగా ఉండండి." అందులో ఒక "దేవదూత ఉంది" అన్నాడట, వారు అతని మాటలు లక్ష్యపెట్టకుండ అలసిపోయినవారు తమ పనిని త్వరగా ముగించుకోవాలనే తొందరలో పడ్డారట. కూలికి పెట్టుకున్నవారు త్వరలోనే వెళ్లిపోయారు. ఆ పాల రాతి బండ, శిల్పి మాత్రమే మిగిలిపోయారట. నేర్పరియైన అతని చేతులతో ప్యూపాలోనుండి సీతాకోక చిలుక వచ్చినట్టు ఆ రాతిలోనుండి దేవదూత చెక్కబడిందట. ఆ బొమ్మ మాట్లాడుతుందో లేక ఎగిరిపోతుందో అన్నట్టు తీర్చి దిద్దబడిందట. తన దివ్య దృష్టితో మైకిలేంజిల్ మాత్రమే ఆ పాలరాతి బండలో దేవదూత బొమ్మను తిలకించ గలిగాడు. రాతి బండను అతడు దేవదూత అన్నాడు దానిలోనుండే అతడు దేవదూత బొమ్మను చెక్కగలిగాడు.

దేవుని వద్దకు ప్రతి క్రైస్తవుడును పాపిగానే వచ్చాడు. మనం మానవ రాతి బండలం. తర్ఫీదు లేని ఆత్మ సంబంధమైన కండ్లు నిస్సహాయమైన, నిరీక్షణలేని, ఉద్దేశంలేని, పనికిమాలిన మానవ బండలగానే మనలను చూచాయి. మహా గొప్ప శిల్పి మన రూపులను దిద్దడమే తన పనిగా పెట్టుకున్నాడు. మనం ఏమైయుంటామో అలాగున ఆయన మనలను చూడక, మనం ఏమి కాగలమో దాన్ని ఆయన మనయందు చూచాడు. మనలో ప్రతి ఒక్కనియందు ఆయన "పరిశుద్ధుని" చూచాడు.

మనం ఆయన పక్షంగా మార్పు చెందియున్నప్పుడు, క్రీస్తు రక్తం ద్వారా మన పాపములను కడిగి, "పరిశుద్ధులని" మనలను పిలువనారంభించాడు. తన జీవిత కాలంలో పరిశుద్ధుడు సంపూర్ణసిద్ధి పొందినవాడుగా కన్పించడు; కాని అనుదినము దేవుడు మనలను మల్చునప్పుడు, మనం ఏమైయుండాలని కోరుకున్నాడో ఆ రూపానికి తెస్తూ ఉంటాడు. ఆయన చిత్తానికి మనం అప్పగించుకున్నవారమై దైవికమైన ఉలిచేత చెక్కబడుతూ ఉంటాం. మనం యిప్పుడు పరిశుద్ధులం. మనం ఎక్కువగా పరిశుద్ధపరచబడినవారమై, ఆయన సేవకు మరి ఎక్కువగా ప్రత్యేకపరచబడుతూ ఆయన సముఖములో జీవించుతూ ఎక్కువగా ఆయనవలె మార్చబడుతూ ఉంటాం.

పరిశుద్ధాత్ముడనే పదానికి కడపటిగా రెండు భాగాల ప్రశ్న: మొదటిగా, నేను పరిశుద్ధుడనయ్యానా? రెండవది, నేను పరిశుద్ధుడనైతే, నా పేరుకు తగినట్టుగా నేను బ్రదుకుతున్నానా?

## పఠనము మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. ఉత్తర ప్రత్యుత్తరాలు ఎంత కష్టంగా ఉంటాయో ఉదాహరణనిమ్ము.
2. క్రొత్త నిబంధనలో స్థిరంగా "పరిశుద్ధుడు" అనే పదం ఎలా ఉపయోగింప బడింది?
3. మొదటి శతాబ్దంలో అద్భుత వరముల ఉపయోగాన్ని వివరించు.
4. పరిశుద్ధాత్మ యిచ్చిన అద్భుతవరములెన్ని?
5. స్థితిలో పరిశుద్ధుడు అంటే అర్థమేమి?

6. పరిశుద్ధునికి తగిన ప్రవర్తన లేకపోయినా, అతడు పరిశుద్ధుడేనా?
7. క్రొత్త నిబంధనలో “సంఘము” “పరిశుద్ధులు” అనే పదాలు ఒకదానికి బదులు ఒకటి ఉపయోగింపబడ్డాయా? అయినట్లయితే, ఎక్కడ?
8. పాత నిబంధన లేఖకులు ఎప్పుడైనా పరిశుద్ధులనే పదం ఇశ్రాయేలుకు ఉపయోగించారా? అయితే, ఎలా?
9. యాజకత్వపు సృష్టి యొక్క వేరైన దశలను చర్చించుము.
10. “పరిశుద్ధులు” అనే భావనతో 1 పేతురు 2:9ని జతచేయుము.
11. ఈ పదానికి మనమెలాటి ప్రత్యుత్తరమియ్యాలి?
12. మన పేరుకు తగినట్టుగా మనం ఎలా జీవించాలి?

సూచనలు

[1]తమ్మును నడిపించడానికి ఈ ఆరంభ సంఘాలలో క్రొత్త నిబంధన రచనగా లేదు; ఎందుకంటె అది యింకను పూర్తి చేయబడలేదు. అందునుబట్టి, వారి అవసరతల కొరకు పరిశుద్ధాత్మ వరములను దేవుడు వారికి ప్రసాదించాడు. ఈ లేఖన భాగంలో, రెండు రకాలైన కృపావరాలు పేర్కొనబడ్డాయి (1 కొరింథీ. 12:8–11; 12:28–30). ఈ కృపావరములు అపొస్తలులు చేతులుంచడంవలన అనుగ్రహింపబడ్డాయి (అపొ. 8:14–17). క్రొత్త నిబంధన రచన ముగించబడి, చివరి అపొస్తలుడు చనిపోయి అపొస్తలులు చేతులుంచినవారిలో చివరి వ్యక్తి చనిపోయినప్పుడు, అద్భుతమైన వరాలు నిలిచి పోయాయి. క్రొత్త నిబంధనయే మనకు గైడు, స్థిరపడడానికి మూలమునై ఉంది. [2]వారికి అద్భుతమైన ఆత్మవరాలున్నాయి. అయితే వారికి అనుగ్రహింపబడిన ప్రత్యక్షతలు క్రమముగా ప్రకటించవలసినవారై ఉన్నారు. ఇద్దరు ఒకే సమయంలో మాట్లాడకూడదు లేక ఇంకొకరు మాట్లాడుతున్నప్పుడు మరియొకరు తనకు కలిగిన ప్రత్యక్షతతో ఎగిరిపడకూడదు (1 కొరింథీ. 14:27, 29). సంఘ కూడికలో స్త్రీలు మాట్లాడుతూ ఉన్న తారుమారును కొంచెం ఎక్కువ చేస్తున్నట్టున్నారు (1 కొరింథీ. 14:34–36). [3]డెబ్బది అయిదుగురు ఐగుప్తుకు వెళ్లినట్టు స్తెఫను అన్నాడు (అపొ. 7:14). డెబ్భైమంది వెళ్లినట్టు పాత నిబంధన అంటుంది (ఆది. 46:27; నిర్గమ. 1:5). పాత నిబంధనకు గ్రీకు తర్జుమాయైన LXX యైతే, ఆదికాండం 46:27లో డెబ్భైయయిదు మందిని కలిగియుంది. మనష్షే యొక్క యిద్దరు కుమారులను, ఎఫ్రాయిము యొక్క యిద్దరు కుమారులను, ఎఫ్రాయిము మనుమడ్ని చేర్చితే డెబ్భై అయిదు మంది ఔతారు. స్తెఫను LXXను కోట్ చేసి ఉండాలి. [4]ఇశ్రాయేలీయులు సీనాయి కొండను విడచిపోడానికి సిద్ధపడుతున్నప్పుడు, జనాభా తీయబడింది (సంఖ్యా. 3:11–51). అప్పుడు లేవీయుల సంఖ్య 22,000. ఐగుప్తునుండి బయటికి వచ్చిన తొలి చూలుల సంఖ్య 22,273. వ్యత్యాసం 273. తొలి చూలుల స్థానంలో లేవీయులు దేవుని పరిచర్యకు తీసికోబడ్డారు, ఒక మనిషికి బదులు మరొకడు; మిగిలినవారు ఒక్కొక్కనికి అయిదు తులముల వెండి చొప్పున విడిపించబడ్డారు. ఈ 1,365 తులముల వెండి అహరోనుకును అతని కుమారులకును యివ్వబడింది. [5]క్రీస్తునకు అవిశ్వాసం చూపిన పరిశుద్ధునికి శాశ్వత జీవన వాగ్దానం ఉండదు (1 కొరింథీ. 9:27) కాని అతడు తప్పు చేసిన కుటుంబ సభ్యునిగా దేవుని కుటుంబంలో ఇంకా ఉండగలడు. ఒకడు క్రీస్తునుండి వెలువడి ఇంతకు ముందెప్పుడు ఎరుగని నీచ స్థితికి తిరిగిపోవచ్చని పేతురు సూచించాడు (2 పేతురు 2:20–22).